క్లుప్తంగా

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధితో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న వార్డెన్ రామయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు వార్డెన్ రామయ్య తెలిపారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ హాస్టల్‌లోని విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టుతున్నామని, ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తున్నామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికబద్ధంగా చదివిస్తున్నామని, శతశాతం ఉత్తీర్ణత సాధించటానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు వారి ఇంటి వద్దకు వచ్చినప్పుడు తల్లిదండ్రులు బాధ్యతగా చదివించాలని కోరారు. హాస్టల్‌లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు.

మాతాశిశు మరణాలకు అడ్డుకట్ట వేయండి



రోగులతో మాట్లాడుతున్న డీపీఎంఓ శ్రీనివాసులు

ఏర్పేడు: గ్రామాల్లో మాతాశిశు మరణాలు నివారించాలని డీపీఎంఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఏర్పేడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. రక్త పరీక్షలు, మందుల నిల్వ చేసే గది, రోగులకు చికిత్స అందించే గది, ఇంజెక్షన్లు, మందులు నిల్వ ఉంచే గదులను తనిఖీ చేశారు. రోగుల సమస్యలు, వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాలు, డయేరియా తదితర వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది షహీరా, విలియం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరులు సమకూర్చుకోండి

వరదయ్యపాళెం: పంచాయతీలు ప్రగతి సాధించాలంటే ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 90 రోజులకొసారి పంచాయతీ పాలకమండలి సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన ప్రగతి పనుల గురించి అజెండా రూపుదించుకోవాలన్నారు. అలాగే ఇంటి పన్నులను వందశాతం వసూలు చేసే బాధ్యత ఆయా పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. రిసోర్స్ పర్సన్ రమణయ్య, ఈఓపీఆర్డీ చిరంజీవి పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధికి సాంకేతిక మార్గాలు

రేణిగుంట: సుస్థిరాభివృద్ధికి యువత సాంకేతిక మార్గాలను ఎంచుకుని, ఆ దిశగా పయనించాలని రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి అన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా ఆర్థిక సహాయంతో రాస్ బాలాజీ బాలవికాస్ ఆధ్వర్యంలో మండలంలోని కరకంబాడి రాస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ యువకుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, దానిని ఉపయోగించుకుని మనతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. సాంకేతిక నిపుణుడు వెంకటేష్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ యువకుల దినోత్సవాన్ని పురస్కరించుకొని యువత వారి గ్రామాల్లో మొక్కలు నాటారు. రాస్ సమన్వయకర్త నాగేంద్రశర్మ, కమ్యూనిటీ మొబలైజర్లు ఉష, జి.వెంకటేష్, కె.వెంకటేష్, మోహన్, శ్రీను పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి వినతులు

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారించాలని సోమవారం పలువురు అర్జీదారులు తహసీల్దార్‌కు విన్నవించారు. నాగనందాపురం, చెన్నవారిపాళెం, సీఎల్ఎన్‌పల్లె, బత్తలవల్లం గ్రామాలకు చెందిన రైతులు అర్జీల ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన ప్రతి అర్జీని రిజిస్టర్‌లో నమోదు చేసి, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు హర్ ఘర్ తిరంగా ర్యాలీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని భేరివారిమండపం వద్ద మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు భేరివారి మండపం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

వసతులు లేని బీసీ వసతి గృహం

- పర్యవేక్షణలోపం.. సిబ్బంది కొరత
- రాత్రి మిగిలిన ఆహారం ఉదయం వడ్డింపు
- రేణిగుంట బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల అవస్థలు

ఇక్కడ ఉండలేకున్నాం..!

భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు వచ్చిన బాలలు వారు.. అమ్మానాన్నలకు దూరంగా ఉంటున్న విద్యార్థులు వారు. వారికి వసతి గృహం, అధికారులే ఆదరువు. అయితే అక్కడ వసతులు కరువై.. సిబ్బంది లేక.. నాణ్యమైన భోజనం అందక వారు అనారోగ్యం పాలై, అస్వస్థతకు గురయ్యారు. ఇక్కడ ఉండలేకున్నాం అంటూ.. అమ్మా, నాన్నలకు కోసం ఎదురుచూస్తున్నారు. ఇదీ రేణిగుంట బీసీ హాస్టల్ దుస్థితి.



హాస్టల్‌పైన అపరిశుభ్రంగా ఉన్న ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న డీపీఓ

రేణిగుంట: బీసీ బాలుర వసతి గృహంలో పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గతంలో 150 మంది విద్యార్థులతో ఎంతో మంచి హాస్టల్‌గా పేరు తెచ్చుకుని ఎక్కువగా కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన విద్యార్థులతో ఉండే ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 60 మంది మాత్రమే పిల్లలున్నారు. హాస్టల్‌లో పిల్లలకు వసతులు కరువవడం, ప్రధానంగా పర్యవేక్షణ లేమి, సిబ్బంది కొరతతో పేద విద్యార్థుల ఆలనా, పాలన కుంటుపడింది. ఇక్కడ రెగ్యులర్ వార్డెన్ లేరు. తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని బీసీ హాస్టల్ వార్డెన్ చైతన్య ఈ హాస్టల్‌కు ఇన్‌చార్జిగా ఉన్నారు. దీంతో ఆయన రెండు రోజులకొకసారి హాస్టల్‌కు వస్తారు. దీనికితోడు వంట మనుషులు, వాచ్‌మెన్ ముగ్గురు ఉండాల్సి ఉండగా, మహాలక్ష్మి అనే ఒక్క మహిళ మాత్రమే ఉన్నారు. ఆమెకు కూడా వయోభారంతో ఆరోగ్యం క్షీణించి, ఆమె తరపున మహేష్ అనే ఓ యువకునితో విద్యార్థులకు భోజనం వండించి పెడుతున్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి, నిరుపయోగంగా మారాయి. హాస్టల్‌లో ప్రతిరోజూ ఉదయం వండిన ఆహారం మిగిలితే రాత్రికి వేడి చేసి పిల్లలకు పెట్టిన సందర్భాలెన్నో ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం ఓ గృహప్రవేశం సందర్భంగా అక్కడ మిగిలిన ఆహారం హాస్టల్ విద్యార్థులకు రాత్రి సిబ్బంది వడ్డించడంతో సోమవారం ఉదయం 21 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయ్యి, అస్వస్థతకు గురయ్యారు.

హాస్టల్ వార్డెన్, సిబ్బందిని సస్పెండ్ చేయాలి

రేణిగుంట: స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులు విషాహారం తిని వాంతులు, విరేచనాలు కావడానికి కారకులైన వార్డెన్ చైతన్య, వంట మనిషి మహాలక్ష్మిని జిల్లా కలెక్టర్ వెంటనే సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. రేణిగుంట ఫ్లై ఓవర్ వంతెనపైన వారు సోమవారం హాస్టల్ విద్యార్థులతో కలసి రాస్తారోకో నిర్వహించారు. బయట ఆహారాన్ని హాస్టల్ విద్యార్థులకు ఎలా పెడుతారని ఆయన ప్రశ్నించారు. పేద విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వార్డెన్ తాను కేవలం ఇక్కడ ఇన్‌చార్జి మాత్రమేనని, తనకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండడం దుర్మార్గమన్నారు.



రేణిగుంటలో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు

హాస్టల్లో వసతులు అధ్వానంగా ఉన్నాయని, జిల్లా అధికారులు స్పందించి, పేద విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బాల, సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్, వేమన విజ్ఞాన కేంద్రం నాయకుడు వెంకటరమణ, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

> ##### వార్డెన్ రెండు రోజులకొకసారి వస్తారు
>
> 
>
> మా సొంతూరు తిరుపతి. నేను పదో తరగతి చదువుతూ రేణిగుంట బీసీ హాస్టల్‌లో ఉంటున్నాను. మాకు రెగ్యులర్ వార్డెన్ లేరు. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి వార్డెన్ చైతన్య సార్ రెండు రోజులకొకసారి వస్తారు. మాకు వేరే వాళ్లు తీసుకొచ్చిన అన్నం పెట్టారు. ఉదయం నుంచి వాంతులు, విరేచనాలు ఎక్కువగా అవుతున్నాయి. మాకు రెగులర్ వార్డెన్‌ను నియమించడంతోపాటు సిబ్బంది కొరత లేకుండా మా బాగోగులు చూసుకోవాలి.
>
> – కె.మనోహర్, హాస్టల్ విద్యార్థి, రేణిగుంట
>
> ##### వసతులు అధ్వానం
>
> 
>
> మా సొంతూరు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు. నేను రేణిగుంట బీసీ హాస్టల్‌లో ఉంటూ ఇక్కడే తొమ్మిదో తరగతి చదువుతున్నాను. మాకు హాస్టల్‌లో వసతులు చాలా దారుణంగా ఉన్నాయి. హాస్టల్‌లోని మరుగుదొడ్లు పూర్తిగా శిథిలమై వినియోగానికి పనికి రావడం లేదు. దీంతో మేము సమీపంలో బహిర్భూమికి వెళుతున్నాం. హాస్టల్ చుట్టూ మురుగునీరు, పందుల బెడద అధికంగా ఉంది. హాస్టల్‌లో సరైన తాగునీటి వసతి లేదు. స్కూల్ నుంచి హాస్టల్‌కు వచ్చే మార్గం గుంతలమయంగా ఉంది. వర్షాకాలం మరింత దారుణంగా ఉంటుంది. అధికారులు కలుగజేసుకుని బాగు చేయించాలి.
>
> – తరుణ్, హాస్టల్ విద్యార్థి, రేణిగుంట





హాస్టల్‌లో విద్యార్థులు, వార్డెన్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ, చికిత్స పొందుతున్న హాస్టల్ విద్యార్థిని పరామర్శిస్తున్న డీఎంహెచ్ఓ శ్రీహరి

నేడు రేణిగుంట గంగమ్మ జాతర

రేణిగుంట: గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సిద్ధమైంది. ఆలయ కమిటీ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం తెల్లవారుజామున గంగమ్మ మూలవిరాట్‌కు అభిషేక పూజలు, పొంగళ్లు, అమ్మవారికి నైవేద్యం, చీర, సారె సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తర్వాత నడివీధి గంగమ్మ శూలం వద్ద అంబళ్లు పోయనున్నారు. అర్ధరాత్రి గంగమ్మ ఉత్సవ మూర్తిని పురవీధుల్లో ఊరేగించి, బుధవారం తెల్లవారుజామున నడివీధి గంగమ్మ వద్ద ప్రతిష్టించనున్నారు. సాయంత్రం అమ్మవారికి దిష్టి కుండల్లో నైవేద్యం సమర్పణతో గంగ జాతర ముగుస్తుంది.

భారీ ఏర్పాట్లు

గంగమ్మ జాతర సందర్భంగా ఇప్పటికే పురవీధుల్లోని ప్రధాన కూడళ్ల వద్ద దేవతామూర్తుల ప్రతిరూపాలతో కూడిన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక క్యూలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.



గరిగెను ఊరేగింపులో చైర్మన్ మల్లికార్జునరెడ్డి

గెరిగ ఊరేగింపు

అమ్మవారికి ప్రతిరూపమైన గెరిగను ఆలయంలో అలంకరించి అక్కడ నుంచి డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య పట్టణంలో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌తోపాటు మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, వీఆర్ రావణన్, లక్ష్మీరెడ్డి, సూరి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ఏర్పేడు: మండలంలోని పల్లం, పాపానాయుడు పేట హైస్కూళ్లు, పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. దేశభక్తి బొమ్మలపై వంద మంది విద్యార్థులతో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన వారికి త్వరలో బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కో–ఆర్డినేటర్లు శిరీషా, సుబోస్, ప్రధానోపాధ్యాయులు ఆనంద్, వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేణిగుంట డీఎస్పీగా వెంకటాద్రి



రేణిగుంట: స్థానిక డీఎస్పీగా వెంకటాద్రి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న డీఎస్పీ భవ్యకిషోర్ రాజమండ్రి డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ గా విధులు నిర్వహిస్తున్న వెంకటాద్రి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఘనంగా కావమ్మ తిరునాళ్ల



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తురాలు

వరదయ్యపాళెం: మండలంలోని కోవూరుపాడులో కావమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. సోమవారంతో అగ్నిగుండ ప్రవేశంతో తిరునాళ్ల ముగిసింది. ఆదివారం రాత్రి 10 గంటలకు అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సోమవారం తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. నిర్వాహకులు సామర్ల మునెమ్మ, నాగభూషణం దంపతులు, గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దళితులను చీల్చేందుకు వర్గీకరణ నాటకం

శ్రీకాళహస్తి: దళితులను రెండుగా చీల్చి, రాజకీయ లబ్ధి పొందేందుకే ఎస్సీ వర్గీకరణ నాటకాన్ని ప్రస్తుత రాజకీయపార్టీలు తెరపైకి తెచ్చాయని దళిత నాయకులు పులి శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మాల నేతలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్సీలను పూర్తిగా అణగదొక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కూలి రవికుమార్, అల్లం మణి, బీఎస్ఎన్ఎల్ నాగరాజు, కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, చెంచురాజు, చింతా రాజేంద్ర, కనపర్తి చంద్రశేఖర్, మురళి, నెలవల ప్రసాద్, రఘు, దివాకర్, శివ, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, వినోద్, నరసింహులు, వెంకటరమణయ్య, గురవయ్య పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న జైభీమ్ నాయకులు

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు పాఠశాలల్లో ఏఐఎస్ఎఫ్ 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరం బెనారస్ విశ్వవిద్యాలయంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ స్ఫూర్తిగా ఆవిర్భవించిందన్నారు. నాటి స్వాతంత్రోద్యమం నుంచి నేటి విద్యారంగ సమస్యల వరకు అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. ప్రసాద్, షాహిద్, చైతు, ముఖేష్, శివ, జయప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సమస్యలు పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రీవెన్స్ డేలో వచ్చే వినతులను విచారించి, వాటికి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల ప్రజావేదికను సిబ్బందితో కలసి నిర్వహించారు. అనంతరం ఆయన వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డే రోజున ప్రజాసమస్యల ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి, తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీటీ చంద్రబాబు, సర్వేయర్ వెంకట్రామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

మండల మీటా?.. పచ్చ మీటింగా?



సమావేశంలో ఏర్పాటు చేసిన పసుపు బ్యానర్

శ్రీకాళహస్తి రూరల్: ఇది మండల సర్వసభ్య సమావేశమా? లేక పచ్చ మీటింగా? అని పలువురు చర్చించుకున్నారు. సోమవారం శ్రీకాళహస్తి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పసుపు రంగు బ్యానర్ ఏర్పాటు చేయడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది మండల సమావేశమా? లేక తెలుగుదేశం పార్టీ సమావేశమో? తెలియడం లేదని పలువురు సభ్యులు చర్చించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని సంప్రదాయాన్ని ప్రస్తుతం అమలు చేయడంపై పలువురు విమర్శించారు. శ్రీకాళహస్తి మండల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంపూర్ణమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ఎమ్మెల్యే ఆలస్యంగా రావడంతో సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభించారు. అన్ని శాఖల అధికారుల నివేదకలపై చర్చలు పెట్టడంతో సమావేశం రాత్రి ఎనిమిది గంటల వరకు కొనసాగింది. మండలంలో దూర ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు వారి గ్రామాలకు వెళ్లేందుకు రాత్రి వేళ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంపీడీఓ పటాన్ రఫీ ఖాన్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హెచ్చరికబోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఏర్పేడు: మండలంలోని మిత్రిమంద కాలనీలో ప్రభుత్వ భూమిలో రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వికృతమాల రెవెన్యూలోని సర్వే నంబర్లు 132, 133లో గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఏర్పాటు తొలగించినట్లు చెప్పారు. విచారణ జరిపి, నిందితులపై చర్యలు తీసుకుని, మళ్లీ సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆర్ఐ నల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగయ్య, వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాసంఘం రాష్ట్ర శాఖ సూచనల మేరకు సోమవారం ముచ్చివోలు ఉన్నత పాఠశాలలో టీచర్లు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖలో సమస్యలపై చర్చించకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఉపాధ్యాయులను మిగులుగా చూపడడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తొట్టంబేడులో కూడా నిరసన తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అన్నాదొరై

ఏర్పేడు: విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలని పాపానాయుడుపేట మత్తు బానిసల పునరావాస కేంద్రం సంచాలకుడు అన్నాదొరై అన్నారు. సోమవారం మండలంలోని పాపానాయుడుపేట హైస్కూల్‌లో విద్యార్థులకు మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసై చాలా కుటుంబాలు ఛిన్నాభిన్నమైపోతున్నాయన్నారు. యువకులు, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, హెచ్ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

పారదర్శకపాలన, జవాబుదారీతనం అవసరం



సత్యవేడు: మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్



నాగలాపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు



బుచ్చినాయుడుకండ్రిగ: మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

సత్యవేడు: పంచాయతీలో పాదర్శక పాలన, జవాబుదారీతనం అవసరమని, ఇవి అమలయ్యేలా సర్పంచులు, కార్యదర్శులు చొరవ చూపాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. 28 పంచాయతీలుండగా 19 మంది సర్పంచ్‌లు హాజరయ్యారు. సోమవారం మాస్టర్ ట్రైనర్స్ శైలేంద్ర, పి.గోవిందస్వామి సర్పంచులకు, కార్యదర్శులకు పంచాయతీ పాలనలో నిర్వర్తించాల్సిన విధులు, విధి విధానాలు, ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుధ్య నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేరు చేసి వర్మీకంపోస్టు తయారీ విధానం, గ్రామ పంచాయతీ అభివృద్ధి నిధులు, ఎస్‌హెచ్‌జీ సభ్యుల భాగస్వామ్యం, పంచాయతీలు ఆర్థికవనరుల సమీకణ, 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పీఎంకే బాబు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ పీఎంకే బాబు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా చెత్త సేకరణ, పొడి, తడి చెత్తలను వేరుచేయడం, వర్మి కంపోస్టు తయారీ చేసే ప్రక్రియ, మార్కెటింగ్, అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సింధూ, వైస్ ఎంపీపీ జాయిస్, కార్యదర్శులు నాగరత్నమ్మ, వెంకటేశ్వరులు, రోజా తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రికలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండలంలోని 28 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్తా సేకరణ, వర్మి కంపోస్టు తయారీ, పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణ, తదితర అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు ఇంటి పన్నులు తప్పనిసరిగా వసూలు చేసి, పంచాయతీల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.